
సాక్షి ఒడిశా

గురువారం । 7। ఆగస్టు। 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 5,74,943

బంగారం : 3 గ్రాముల 900 మిల్లీ గ్రాములు

వెండి : 109 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



లక్ష్యసాధన అభినందనీయం

గజపతి జిల్లాలో హెల్త్, విద్య, మహిళా స్వయం సహాయక గ్రూపులు, పౌరసరఫరాలు, ఐ.సి.డి.ఎస్‌లు లక్ష్యాలు సాధించడం అభినందనీయమని మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ అన్నారు.

- 8లో▸



శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

సమాజంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే పోలీసు సమితి సమావేశాల ప్రధాన లక్ష్యమని జయపురం ఎస్‌డీపీఓ పార్థ జగదీష్ కాశ్యప్ అన్నారు.

- 8లో▸

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన కొరాపుట్ ఎంపీ ఉల్క



పార్లమెంట్ ఆవరణలో సీఎం మోహన్‌చరణ్ మఝితో ఎంపీ సప్తగిరి ఉల్క

కొరాపుట్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మఝిని కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్క మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం న్యూఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలో ఈ భేటీ జరిగింది. రాయగడ జిల్లాలో వైద్య కళాశాల, ఎయిర్ పోర్టు ఏర్పాటు చేయాలని, కొరాపుట్ జిల్లాలో ఉన్న ప్రభుత్వ సాహిద్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాలను అభివృద్ధి చేయాలని, కొరాపుట్ జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు.

బీజేడీ నాయకుడు మృతి



శివ పట్నాయక్

కొరాపుట్: ప్రతిపక్ష బీజేడీ నాయకుడు శివ పట్నాయక్ (63) అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం వేకువజామున కొరాపుట్ జిల్లా జయపూర్ పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. స్వగ్రామం బొరిగుమ్మ సమితి బెనాసుర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. ఈయన బొరిగుమ్మ సమితి కార్యనిర్వాహక పార్టీ అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. మాజీ మంత్రి రబి నారాయణ నందో తదితరులు నివాళులు అర్పించారు.

గంజాయి రవాణా ముఠా గుట్టురట్టు

- 21 కిలోల గంజాయి స్వాధీనం
- నలుగురు అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ముఠా గుట్టురట్టయింది. అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా విషయం వెలుగు చూసింది. జిల్లాలోని అంబొదల పోలీసులు 21.260 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురుని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మహారాష్ట్రకు చెందిన అఫ్రద్ సా, రషన్ హెడ్గేలు ఉండగా రాయగడ జిల్లాలోని చంద్రపూర్‌కు చెందిన శ్యామఘన్ కాసి, కదమ్ శెఠిలు ఉన్నారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. మంగళవారం అంబొదల పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అమ్లాపేట శివమందిరం సమీపంలోని ఓ చెట్టు కింద నలుగురు బస్తాలు పట్టుకుని ఉండటాన్ని గమనించారు. దీంతో అనుమానంతో వారిని అదుపులోకి తీసుకొని తనిఖీలు చేయగా గంజాయి పట్టుబడింది. నిందితులను అరెస్టు చేసి బుధవారం కోర్టుకు తరలించారు.

చట్ట సవరణకు సన్నాహాలు

- జగన్నాథ ఆలయ చట్టం, 1955 సవరణలకు ప్రతిపాదన
- సేవాయత్‌లతో సంప్రదింపులు జరిపిన సీఏఓ

శ్రీ మందిర్ కోసం కొత్త చట్టం: మంత్రి

శ్రీ మందిరం కోసం కొత్త చట్టం ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తెలిపారు. దీని కోసం నిపుణుల ఆధ్వర్యంలో అధ్యయనం కొనసాగుతుందన్నారు. 1950 దశకంలో ప్రవేశ పెట్టిన పాత చట్టం యథాతథంగా కొనసాగుతుందని చెప్పారు. వర్ధమాన పరిస్థితులకు అనుగుణంగా చట్టం సవరణలు, సంస్కరణలు అనివార్యంగా గుర్తించినట్లు మంత్రి వివరించారు.



పూరీ శ్రీమందిరం



శ్రీమందిరం సీఏఓ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం

భువనేశ్వర్: జగన్నాథ ఆలయ చట్టం, 1955 సవరణ సన్నాహాలు ఊపందుకున్నాయి. శ్రీ మందిరంలో తరచూ వివాదాలు నెలకొంటున్న నేపథ్యంలో చర్యలు చేపట్టేందుకు వీలుగా అమల్లో ఉన్న చట్టం సవరణ అనివార్యంగా మారింది. ఈ క్రమంలో సీనియర్ సేవాయత్‌లు పూరీ జిల్లా మేజిస్ట్రేట్, పోలీసు సూపరింటెండెంట్, జగన్నాథ ఆలయ అథారిటీ అధికారులతో శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ డాక్టర్ అరవింద కుమార్ పాఢి ప్రత్యక్షంగా సంప్రదించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న శ్రీ జగన్నాథ ఆలయ చట్టం, 1955 సవరణ అత్యవసరంగా పరిగణించి అనుబంధ కార్యాచరణ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసినట్లు తెలిపారు.

- శ్రీ మందిరం ప్రాంగణం లోపల లేదా ఆలయ శిఖరం దృశ్యాల్ని మొబైల్ కెమెరాలు, డ్రోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా చిత్రీకరించడం ఇతరేతర అభ్యంతరకర కార్యకలాపాలు నిషేధించడానికి శ్రీ జగన్నాథ ఆలయ చట్టం, 1955కి ప్రభుత్వ సవరణలను రాష్ట్ర న్యాయ శాఖకు అధికారిక ప్రతిపాదనలను శ్రీ మందిరం అధికార వర్గం సమర్పించింది. ఆలయ లోపల, ఆవరణలో మొబైల్ ద్వారా ఫొటోలు, వీడియోలు తీయడం లేదా డ్రోన్‌లను ఉపయోగించడంపై సవరణ, కఠిన చర్యలు కోసం ప్రధానంగా ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో శ్రీ మందిరం ప్రధాన నిర్వాహకుడు న్యాయశాఖకు లేఖ రాశారు.
- ఈ లేఖలో జగన్నాథ ఆలయ చట్టం, 1955లోని సెక్షన్ 30 (ఎ) లోని 6 నుంచి 9 వరకు ఉప–విభాగాలను సవరించడానికి ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. దీనిప్రకారం, ఆలయం లోపల ఫొటోలు, వీడియోలు తీయడానికి మొబైల్,ఏదైనా ఎలక్ట్రానిక్ పరికరాలతో ప్రవేశిస్తే 3 సంవత్సరాల జైలు శిక్ష గానీ, రూ. 20,000 జరిమానా గానీ, రెండూ విధించవచ్చు.
- జగన్నాథ మహా ప్రభువు భక్తుల మతపరమైన మనోభావాలను దెబ్బతీసే ఫొటోలు, వీడియోల చిత్రీకరణ, సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రసారం చేసిన వారి వ్యతిరేకంగా కఠిన చర్యలను ప్రతిపాదించారు. దీని ప్రకారం నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన వారికి ఏడేళ్ల ఖైదు గానీ, రూ. 50,000 జరిమానా, గానీ, ఉభయ శిక్షల్ని విధించాలని వివరించారు.
- పూరీ శ్రీ జగన్నాథుని మందిరం ప్రాంగణం,పరిసరాల్లో అనుమతి లేకుండా డ్రోన్‌లను ఉపయోగించినట్లయితే 7 సంవత్సరాల జైలు శిక్ష , రూ. 50,000 వరకు జరిమానా విధించే ప్రతిపాదన చేశారు. ఈ సవరణకు అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ న్యాయ శాఖకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శ్రీ మందిరం పాలకమండలి సమావేశంలో దీనిపై వివరంగా చర్చించి ఈ ప్రతిపాదనలు చేసినట్లు స్పష్టం చేశారు.

విజిలెన్స్ వలలో జూనియర్ క్లర్క్

- మృతి చెందిన ఉపాధ్యాయుడు కుటుంబం నుంచి లంచం డిమాండ్
- వలపన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు



విజిలెన్స్ అధికారులకు చిక్కిన హెడ్ క్లర్క్ సంబిత్ త్రిపాఠీ

కొరాపుట్: లంచం తీసుకోవడానికి ఎటువంటి మానవ నైతిక విలువలు లేని ప్రభుత్వ ఉద్యోగిని ఒడిశా అవినీతి నిరోధక శాఖ విజిలెన్స్ విభాగం అదుపులోకి తీసుకొంది. కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి విద్యా కార్యాలయంలో జూనియర్ క్లర్క్ సంబిత్ త్రిపాఠి లంచం తీసుకుంటుండగా విజిలెన్స్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఇదే సమితికి చెందిన ఓ ఉపాధ్యాయుడు 2019లో అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వ పరంగా రావాల్సిన పింఛన్, ఇతర ఆర్థిక సదుపాయాలు అందలేదు. దీనికి సంబంధించిన ఫైల్‌ను ముందుకు పంపాల్సిన క్లర్క్ సంబిత్ లంచం కోసం బాధిత కుటుంబానికి వేధించారు. వృద్ధురాలైన మృతుని భార్యకి రు.30 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో ఆమె విజిలెన్స్ విభాగాన్ని సంప్రదించారు. వారిచ్చిన రు.15 వేల నగదుని సంబిత్‌కి బుధవారం అందజేస్తున్న సమయంలో మాటువేసిన విజిలెన్స్ సిబ్బంది రంగప్రవేశం చేసి సంబిత్‌ని అదుపులోకి తీసుకున్నారు. లంచంగా అందుకున్న నగదుని స్వాధీనం చేసుకున్నారు. నిందితుని ఆస్తులు లక్ష్యంగా సోదాలు ప్రారంభమయ్యాయి.

బీజేడీ ఛత్ర జనతాదళ్ నాయకుల ధర్నా




ఎస్పీ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న బీజేడీ విద్యార్థి నాయకుడు బిశ్వజిత్ త్రిపాఠి

పర్లాకిమిడి: రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినులపై జరుగుతున్న వరుస దాడులను నిరసిస్తూ మంగళవారం రాణిపేట వద్ద జిల్లా పోలీసు ఎస్పీ కార్యాలయం ఎదుట బీజేడీ యువజన, ఛత్రజనతాదళ్ నాయకులు ధర్నా చేపట్టారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝిని దుయ్యబట్టారు. అనంతరం జిల్లా ఛత్ర జనతాదల్ నాయకులు బిశ్వజిత్ త్రిపాఠి విలేకరులతో మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, క్యాంపస్‌లో విద్యార్థినులపై అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం అదనపు ఎస్పీ మహంతికి బీజేడీ ఛత్ర జనతాదళ్ అధ్యక్షులు బిశ్వజిత్ త్రిపాఠి, యువజన నాయకులు శాసనం లింగరాజులు వినతిపత్రం అందజేశారు.

1078 తాబేళ్లు పట్టివేత : ముగ్గురు అరెస్టు



తాబేళ్లతో పట్టుబడిన నిందితులు



స్వాధీనం చేసుకున్న తాబేళ్లు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి మోటు ప్రాంతంలో అటవీశాఖ అధికారులు బుధవారం ఉదయం వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బొలేరా వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 1078 తాబేళ్లను పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. జిల్లా అటవీ అధికారి సాయికిరణ్‌కు మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తుల నుంచి తాబేళ్లను అక్రమంగా రవాణ చేస్తున్నట్టు ఫోన్ ద్వారా సమాచారం వచ్చింది. దీంతో అప్రమత్తమైన ఆయన మంగళవారం రాత్రి రెండు బృందాలుగా సిబ్బందిని కేటాయించి నిఘా పెట్టించారు. ఒక బృందం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమ జిల్లా కుంట వంతెన వద్ద, మరో బృందం మోటు వంతెన వద్ద పెట్రోలింగ్‌కు పంపారు. బుధవారం ఉదయం కుంట వంతెన వద్ద అటవీశాఖ సిబ్బంది ఓ బొలేరా వాహనం అతివేగంగా రావడంతో అనుమానించి దాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో తాబేళ్లు ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మోటు అటవీశాఖ కార్యాలయం వద్ద అటవీ రేంజర్ మురళీధర్ అనుగోలియా పట్టుబడ్డ తాబేళ్లను లెక్కించగా 1078 ఉన్నట్టు గుర్తించారు. వీటిలో 910 బతికి ఉండగా.. 168 మృతి చెందాయి. అలాగే ఈ ఘటనతో సంబంధం ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో సుకుమ జిల్లా ధోరణాపాల్ గ్రామానికి చెందిన చంద్రదేవ్, కలిమెల సమితి యంవీ 79 గ్రామానికి చెందిన సుకుమార్ తరప్దార్, విశ్వనాథ్ మండాల్‌గా గుర్తించారు. వీరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తామని రేంజర్ మురళీధర్ అనుగోలియా చెప్పారు. తాబేళ్లను యం.పి.వి.65 గ్రామానికి తరలిస్తున్నట్టు నిందితులు చెప్పారన్నారు. వీటిని సంతల్లో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్టు పేర్కొన్నారు.

కేంద్రమంత్రులతో ముఖ్యమంత్రి భేటీ



కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి



కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు, ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి హెచ్.డి.కుమార స్వామితో..



కేంద్ర జల వనరుల శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్‌కు వికసిత ఒడిశా, భారత్ సంచిక అందజేసిన ముఖ్యమంత్రి



కేంద్ర వినియోగదారు వ్యవహారాలు, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీతో సీఎం

భువనేశ్వర్: న్యూఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి బుధవారం పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా, భారీ పరిశ్రమలు, ఉక్కు, ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి హెచ్.డి.కుమార స్వామి, జల వనరుల శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్, వినియోగదారుల వ్యవహారాలు, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులకు ముఖ్యమంత్రి 'విజన్ ఒడిశా 2036 – 2047 పుస్తకాన్ని అందజేశారు. కేంద్ర, రాష్ట్ర సమన్వయం, రాష్ట్ర వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై కేంద్ర హోంమంత్రితో చర్చించారు. కేంద్ర భారీ పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలు, ఉక్కు మంత్రి హెచ్.డి. కుమారస్వామితో సమావేశమై రౌర్కెలా ఉక్కు కార్ఖానా విస్తరణతో సహా ఒడిశాలో ఉక్కు రంగం అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పారిశ్రామిక రంగం అభివృద్ధి, ఉపాధి కల్పనకు సంబంధించిన విషయాల్ని ప్రస్తావించారు. కేంద్ర జల వనరుల విభాగం మంత్రి సి.ఆర్.పాటిల్‌తో మహానది జలాల పంపిణీ వివాదంపై ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో తాండవిస్తున్న ఆందోళనకర పరిస్థితుల్ని కేంద్ర మంత్రికి వివరించారు. ఛత్తీస్‌గఢ్‌తో కొనసాగుతున్న జల పంపిణీ వివాదాన్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించే దిశలో ఒడిశాకు న్యాయం చేకూర్చేందుకు సహకరించాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి విన్నవించారు. న్యూఢిల్లీలో కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ విభాగం మంత్రి ప్రహ్లాద్ జోషితో సమావేశం పురస్కరించుకుని ఈ సీజనులో బియ్యం సేకరణ పరిమితిని విస్తరించాలని సీఎం కోరారు. ఈ ఏడాది అంచనా ప్రకారం రాష్ట్రంలో వరి సాగు విరివిగా సాగిందని, బియ్యం ఉత్పాదన గణనీయంగా పెరుగుతుందని, ఈ పరిస్థితుల్లో బియ్యం సేకరణ పరిమితి విస్తరణ అత్యంత కీలకమని వివరించారు. పరిమితి విస్తరించని పరిస్థితుల్లో మిగులు బియ్యం నిర్వహణలో ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. బియ్యం నిల్వల సక్రమ నిర్వహణ నేపథ్యంలో భారత ఆహార సంస్థ ఎఫ్‌సీఐ ద్వారా నెలవారీ బియ్యం సేకరణను పెంచాలని ముఖ్యమంత్రి కోరారు. ఆహార భద్రత బలోపేతం, రైతుల ప్రయోజనాల పరిరక్షణ లక్ష్యంగా చిరుధాన్యాల సాగు ప్రోత్సాహం, నిల్వ మౌలిక సదుపాయాల విస్తరణతో ఒడిశా ప్రభుత్వం తీసుకుంటున్న పలు చర్యలను కేంద్ర మంత్రికి వివరించారు.

అందుబాటు ధరల్లోనే మహా ప్రసాదం

- ఆనంద బజారులో విక్రయాలపై ప్రత్యేక దృష్టి
- మోసాలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపట్టిన సీఏఓ



జగన్నాథుని మహా ప్రసాదం ఒబొధా

భువనేశ్వర్: పవిత్ర పుణ్య క్షేత్రం పూరీ శ్రీమందిరంలో కొలువుదీరిన జగన్నాథుని దర్శనం తర్వాత స్వామికి నివేదించిన అన్న ప్రసాదాల (ఒబొధా) సేవన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంటుంది. సువిశాల రత్న వేదికపై కొలువు దీరిన చతుర్ధా మూర్తుల దర్శనం కోసం గుంపులో సతమతమై వెలుపలకు వచ్చిన భక్తులు ఆనంద బజారు సందర్శిస్తారు. ఈ ప్రాంగణంలో అద్భుతమైన స్వామి అన్న ప్రసాదాల విక్రయిస్తారు. పవిత్ర మహా ప్రసాదం కొనుగోలు వ్యవహారంలో సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన యాత్రికులు, పర్యాటకులు, భక్తులు తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారు. మహా ప్రసాదాల ధరలు చుక్కల్ని తాకుతుండటమే ఇందుకు కారణం. అదుపు, నియంత్రణ లేని ధరలతో భక్తజనం తల్లడిల్లి తీవ్ర నిరుత్సాహంతో వెనుదిరుగుతున్న పరిస్థితులు వెలుగుచూస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికారిక యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. సరసమైన, నియంత్రిత ధరలకు మహా ప్రసాదం అందుబాటులోకి తీసుకు రానున్నారు. ఈ మేరకు శ్రీమందిర్ ప్రధాన పాలన అధికారి సీఏఓ డాక్టర్ అరవింద్ కుమార్ పాఢి అధ్యక్షతన శ్రీమందిర్ ఆనంద్ బజార్ వర్గీయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

అందరికీ తెలిసేలా బోర్డులు..

ఆనంద్ బజార్ సముదాయంలో పాడి ప్రసాదాలు, అన్న మహా ప్రసాదాలను వేర్వేరు ప్రాంగణాల్లో విక్రయిస్తారు. ప్రధానంగా అన్న మహా ప్రసాదాల విక్రయ ప్రాంగణాల్లో ఇతర ప్రసాదాల విక్రయాలు నివారిస్తారు. ఆనంద్ బజార్ నుంచి మహా ప్రసాదాన్ని కొనుగోలు చేసేటప్పుడు భక్తులు మోసానికి గురికాకుండా ధరలు నిర్ణయిస్తారు. ఈ ధరల్ని అందరి దృష్టిని ఆకట్టుకునేలా ప్రదర్శిస్తారు. ఆనంద్ బజార్‌లో సూపకార్ వర్గీయులు మాత్రమే మహా ప్రసాదం విక్రయిస్తారు. శ్రీ మందిరం ఉద్యోగులకు డ్రెస్ కోడ్ అవలంబనకు ప్రాధాన్యత కల్పిస్తారు. పాలక మండలి నిర్ణయాన్ని సువార్ మహాసువార్ వర్గం శ్రీమందిర్ స్వాగతించింది. ఒబొధా అమ్మకం సమయంలో ఎలాంటి అశాంతిని సహించేది లేదని స్పష్టం చేశారు. ఆనంద్ బజార్‌లో ఎటువంటి మోసం లేకుండా భక్తులు ఒబొధా మహా ప్రసాదాన్ని క్రమబద్ధంగా ఎలా పొందగలుగుతారు అనే అజెండాతోనే సమావేశం సుదీర్ఘంగా కొనసాగిందని శ్రీమందిర్ అభివృద్ధి విభాగం అధికారి దేబ్రబ్రత్ సాహు తెలిపారు. ఈ సందర్భంగా సేవాయత్ వర్గం ప్రసాదాల ధరను నిర్ణయించాలని కోరింది. వీరి ప్రతిపదాన మేరకు పాడి ప్రసాదాలు, అన్న మహా ప్రసాదాన్ని వేర్వేరు ప్రదేశాలలో విక్రయించాలని నిర్ణయించారు. సువార్ మహాసువార్ సంఘం కార్యదర్శి నారాయణ్ మహాసువార్ మాట్లాడుతూ స్వామి ప్రసాదాల తయారీలో నాణ్యమైన నెయ్యిని మాత్రమే ఉపయోగించాలని కోరారు. స్వతంత్ర శ్రీమందిర్ భద్రతా దళాల పర్యవేక్షణలో శ్రీ మందిరం లోనికి డాల్డా ఇతరేతర నేతి సంబంధిత నాసి రకపు పదార్థాలు ప్రవేశించకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్యోగులు డ్రెస్ కోడ్‌ను కచ్చితంగా పాటించాలని విన్నవించారు. స్వామి దర్శనం తర్వాత శ్రీ మందిర్‌లోని గందరగోళ వాతావరణం నుంచి బయట పడి ఆనంద బజారు సందర్శించే భక్తులు ఆహ్లాదకరమైన అనుభూతిని పొందేలా చర్యలు చేపట్టడం అత్యవసరమని సేవకులు ప్రతిపాదించారు.

త్వరలో పాలక మండలి..

శ్రీ మందిరం పాలక మండలి ఏర్పాటుకు సంబంధించి ప్రాథమిక దశ కార్యాచరణ పూర్తయ్యింది. ఈ మేరకు అవసరమైన ప్రతిపాదనలు దాఖలు చేశారు. ప్రభుత్వం ఈ విషయంలో చర్యలు తీసుకుంటుందని శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ డాక్టర్ అరవింద్ కుమార్ పాఢి తెలిపారు. సమావేశంలో శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ డాక్టర్ అరవింద్ కుమార్ పాఢి, జిల్లా కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా, అభివృద్ధి విభాగం ప్రముఖుడు దేబ్రబ్రత్ సాహు, సేవా విభాగం ప్రముఖుడు జితేంద్ర సాహు, భద్రతా విభాగం ప్రముఖుడు హేమంత్ పాఢి, పోలీసు కమాండెంట్, మాజీ పాలక మండలి సభ్యులు, సేవాయతుల ప్రతినిధులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుల ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు

భువనేశ్వర్: పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా 662 వర్గ మండల కళాశాల సంఘం ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు ధర్నా చేపట్టారు. అనంతరం ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రికి ఉద్దేశించిన లేఖను జిల్లా కలెక్టరుకు అందజేశారు. అంతకు ముందు స్థానిక గీతా భవన్ నుంచి ర్యాలీగా బయల్దేరి కలెక్టరు కార్యాలయం ఆవరణలో శాంతియుతంగా నిరసన చేపట్టారు.


ప్రభుత్వ భవనాలకు కాషాయ రంగు

- ఒడియా భాషలో నామ ఫలకాలు
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

భువనేశ్వర్: రాష్ట్రంలో ప్రభుత్వ భవనాలను ఏకరీతి కాషాయ నేపథ్య రంగుతో వన్నె దిద్దనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలైనట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వ భవనాల మరమ్మతులు, పునరుద్ధరణల సమయంలో ఈ కార్యాచరణ అమలు చేస్తారు. అంచెలంచెలుగా ప్రభుత్వ భవనాలు సమగ్రంగా కాషాయ నేపథ్య రంగు శోభతో కొత్త రూపు దాల్చుకోనున్నాయి. ఈ కార్యాచరణ కోసం నమూనా రంగు శైలిని జారీ చేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా..

రాష్ట్ర వ్యాప్తంగా దుకాణాలు, వాణిజ్య సంస్థల పేరు తదితర వివరాల్ని ఒడియా భాషలో రాయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ఆదేశాల కార్యాచరణ కోసం ప్రధాన మార్గదర్శకాలు జారీ అయ్యాయి.



ప్రభుత్వ భవనాలకు కాషాయ రంగు వర్ణ సమూనా

నామ ఫలకంపై (సైన్ బోర్డు) 60 శాతం ఒడియా భాషలో వివరాలు రాయాల్సి ఉంటుంది. నామ ఫలకాలపై ఒడియా భాషలో రాతల కోసం తొలి అవకాశం కింద సముచిత సవరణ కోసం 55 రోజుల గడువు మంజూరు చేస్తారు. గడువులోగా సవరణలు పూర్తి కాకుంటే సరిదిద్దే వరకు రోజుకు రూ.500 చొప్పున జరిమానా విధించడం జరుగుతుందని, రాష్ట్ర గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధిశాఖ ప్రముఖ కార్యదర్శి ఉషా పాఢి రాష్ట్రంలో అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్ (ఎన్ఏసీ)లకు లేఖ జారీ చేశారు.

క్లుప్తంగా

'ఆత్మాహుతి' విచారణ వేగవంతం

భువనేశ్వర్: బాలాసోర్ ఫకీర్ మోహన్ కళాశాల విద్యార్థిని ఆత్మాహుతి సంఘటనపై విచారణ వేగవంతం చేస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర క్రైం శాఖ అధీనంలో మహిళలపై నేరాల విభాగం సీఏడబ్ల్యూ త్వరితగతిలో దర్యాప్తు ముగించేందుకు రంగంలోకి దిగింది. ఈ ప్రక్రియని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ స్థాయి అధికారి ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. రాష్ట్ర సీఐడీ పోలీసు సూపరింటెండెంట్ అనిరుధ్ రౌత్రాయ్ మార్గనిర్దేశకులుగా వ్యవహరిస్తారు. ఈ మేరకు ఆయన బాలాసోర్‌ను సందర్శించారు.

పిడుగుపాటుతో మహిళ మృతి

- ఎనిమిది మందికి గాయాలు



పర్లాకిమిడి కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయఘడ బ్లాక్ మర్లబ పంచాయతీలో పెగ్గడ గ్రామంలో బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో పిడుగు పడి మహిళ మృతి చెందింది. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతి చెందిన మహిళ పెగ్గడ గ్రామానికి చెందిన మోనీ గోమాంగో (35) అని రాయఘడ పోలీసు అధికారులు తెలియజేశారు. పోలీసుల తెలిపిన సమాచారం మేరకు.. చెరువు పనిలో కూలీలు పనిచేస్తుండగా ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. వారికి దగ్గరలో పిడుగు పడటంతో అక్కడే ఉన్న కూలీలకు తీవ్రగాయలయ్యాయి. మహిళ మృతి చెందింది. సునీతా శోబోరో, సుశీలా శబోరో, సుభద్ర శోబోరో, సునాయి శోబోరోకు గాయాలయ్యాయి. వీరిని రాయఘడ బ్లాక్ స్వాస్థ్య కేంద్రానికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం పర్లాకిమిడి పెద్దాస్పత్రికి రిఫర్ చేశారు. రాయఘడ బ్లాక్ పోలీసు అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసును నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని ఒక బంగారు దుకాణంలో పనిచేస్తున్న యువకుడు కడుపునొప్పి తాళలేక విషంతాగి చికిత్స పొందుతూ మృతి చెందాడని రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు బుధవారం తెలియజేశారు. వివరాల్లోకి వెళ్తే.. సంతకవిటి మండలం జీఎంపురం గ్రామానికి చెందిన గురుగుబెల్లి పృథ్వీరాజ్ (25) నగరంలోనే అద్దె ఇంట్లో ఉంటూ షాపులో పనిచేస్తున్నాడు. గత కొంత కాలంగా తీవ్రంగా కడుపు నొప్పి వేధిస్తుండడంతో రెండు రోజుల క్రితం విషం తాగాడు. విషయం తెలిసిన బంధువులు ముందుగా రిమ్స్‌లో చేర్చారు.. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బుధవారం మృతి చెందడంతో మృతుని మేనమామ టి.జగన్నాథరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అందుబాటులోకి వ్యాక్సిన్లు

టెక్కలి రూరల్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ టెక్కలి జిల్లా ఆస్పత్రిలో గత కొద్ది రోజులుగా చిన్నపిల్లలకు వేసే వ్యాక్సిన్లు అందుబాటులో లేకపోవడంతో పలుమార్లు సాక్షిలో వెలువడిన కథనాలకు జిల్లా వైద్యాధికారులు స్పందించారు. ఈ మేరకు బుధవారం పూర్తిస్థాయిలో వ్యాక్సిన్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో కె.కొత్తూరు పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ఐపీవీ, డీపీటీ, ఎంఆర్, రోటా, ఓపీవీ ఇతర వ్యాక్సిన్లు చిన్నారులకు వేశారు.

అథ్లెటిక్స్ పోటీలకు 11 మంది విద్యార్థులు

ఇచ్ఛాపురం: ఈనెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కనుపూర్ అక్షర సీబీఎస్‌ఈ పాఠశాలలో జరగనున్న సీబీఎస్‌ఈ క్లస్టర్ 7 అథ్లెటిక్స్ పోటీల్లో స్థానిక జ్ఞానభారతి నుంచి 11 మంది విద్యార్థులు ప్రాతినిధ్యం వహిస్తున్నారని పాఠశాల కార్యనిర్వాహణ అధికారి జోహార్‌ఖాన్ తెలిపారు. ఈ మేరకు వీరికి పాఠశాల ఆవరణలో బుధవారం అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐబీ పండా, హెచ్‌ఎం రషీదా సుల్తానా, వ్యాయామ ఉపాధ్యాయులు కైలాస్‌పండా, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ టీచర్లకూ అవార్డులు ఇవ్వాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే ఉత్తమ ఉపాధ్యాయ, అధ్యాపక అవార్డులను ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్నవారికి సైతం అందజేయాలని ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ యూనియన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ జి.మన్మథరావు, జిల్లా అధ్యక్షుడు నాగశివ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావులు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ అక్షరాస్యతలో వంద శాతం సాధించడానికి ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ పాత్ర ఎంతో కీలకమనే విషయాన్ని గుర్తుచేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న స్టూడెంట్స్ కంటే.. ప్రైవేట్ విద్యాసంస్థలలో చదువుతున్న స్టూడెంట్స్ ఎంతో అధికమన్నారు. తమను కూడా ప్రభుత్వాలు ఇచ్చే అవార్డుల్లో చేర్చాలని కోరారు.

లక్ష్యసాధన అభినందనీయం

- రాష్ట్ర మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్
- ఆకాంక్ష జిల్లా అధికారులకు పురస్కారాలు ప్రదానం



గుమ్మా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పార్థో ప్రత్యూష్ పండాను సత్కరిస్తున్న మంత్రి హరిచందన్

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో ఐదు ప్రభుత్వ శాఖలు హెల్త్, విద్య, మహిళా స్వయం సహాయక గ్రూపులు, పౌర సరఫరాలు, ఐ.సి.డి.ఎస్‌లు లక్ష్యాలు సాధించడం అభినందనీయమని రాష్ట్ర ఎక్సైజ్, వర్క్స్, న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ అన్నారు. స్థానిక కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఆర్.సెట్టి భవనంలలో బుధవారం సంపూర్ణతా అభియాన్ సత్కార మహోత్సవం నిర్వహించారు. ఆర్.ఉదయగిరి, గుమ్మా బ్లాకులలో సంపూర్ణవిజయాలు సాధించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝి ఆదేశాల మేరకు ఆయా బ్లాకుల అధికారులు, వర్కర్లు, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, డి.ఎఫ్.ఓ. కె.నాగరాజు, పురపాలక చైర్మన్ నిర్మలా శెఠి, కలెక్టర్ మధుమిత, ఎస్పీ జ్యోతీంద్ర పండా, జిల్లా పరిషత్తు ముఖ్యకార్యనిర్వాహణ అధికారి శంకర కెరకెటా తదితరులు హాజరయ్యారు. గుమ్మా, ఆర్.ఉదయగిరి ఆకాంక్ష సమితులలో ఐదు ప్రభుత్వ శాఖల అధికారులకు పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. మొత్తం 115 మంది అధికారులతో పాటు వర్కర్లు, దిగువస్థాయి అధికారులకు కూడా మంత్రి చేతులమీదుగా బహుమతులు అందజేశారు. వీరిలో బి.డీ.ఓ.(గుమ్మా) దులారాం మరాండి, గుమ్మా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పార్థో పండా, గుసాని బి.డి.ఒ. గౌరచంద్ర పట్నాయక్, డీఈఓ డాక్టర్ మాయధర్ సాహు, శిశుసంక్షేమాభివృద్ధి అధికారి మనోరమా దేవి, సి.డి.ఎం.ఓ. డాక్టర్ యం.యం. ఆలీ, జిల్లా ఉపాధి, నైపుణ్యతాభివృద్ధి శాఖ అధికారి సౌభాగ్య స్మృతి రంజన్ త్రిపాఠి ఉన్నారు.



గుమ్మా బీడీఓ దులారాం మరాండి, జిల్లా కలెక్టర్ మధుమితను సత్కరిస్తున్న మంత్రి

ప్రజల చెంతకు పథకాలు..

ఈ సందర్భంగా మంత్రి హరిచందన్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి స్థానిక అధికారుల చేతుల్లోనే ఉందన్నారు. ప్రభుత్వ పథకాలు పకడ్బందీగా అమలు చేసి ప్రజల వద్దకు చేర్చాలన్నారు. గజపతి జిల్లాలో మహిళాభివృద్ధికి పరిశ్రమలు ఏర్పాటు చేసి లక్షాధిపతులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో వివిధ ప్రభుత్వ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.



ప్రభుత్వ పథకాల సమీక్షలో పాల్గొన్న మంత్రి హరిచందన్

11 నుంచి ఆందోళన చేస్తాం..

- మంత్రి హరిచందన్‌కు వినతిపత్రం అందజేసిన జిల్లా రెవెన్యూ అమలా సంఘం నాయకులు



మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న జిల్లా రెవెన్యూ అమలా ఉద్యోగుల సంఘం

పర్లాకిమిడి: గజపతి జిల్లా రెవెన్యూ అమలా సంఘం స్థానిక సర్క్యూట్ హౌస్‌లో రాష్ట్ర మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా రెవెన్యూ అమలా సంఘం ఉద్యోగులు ఆగస్టు 11 నుంచి సామూహిక సెలవు పెట్టి ఆందోళనలోకి వెళ్లనున్నట్టు మంత్రికి తెలియజేశారు. రెవెన్యూ అమలా సంఘం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిశీలించాలని సంఘం కార్యదర్శి సంతను మిశ్రా, తదితరులు కోరారు. ముఖ్యంగా ఒడిశా రెవెన్యూ సర్వీసు నియమావళి 2017 ప్రకారం మినిస్టీరియల్ ఉద్యోగులకు 9 లెవల్ బేసిక్ పే మంజూరు చేయాలని, ప్రతి ప్రభుత్వ ఉద్యోగికీ రూ.20 లక్షల ఆరోగ్య బీమా కార్డు, విధుల్లో చనిపోయిన ఉద్యోగుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం లభించేలా 2020 సంవత్సరంలో అమలుచేసిన జీవోను రద్దుచేసి 1990 ఓ.ఆర్.ఎ స్.పి జీవోను తిరిగి అమలు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో కార్యదర్శి సంతును మిశ్రా, ఇతర రెవెన్యూ ఉద్యోగులు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల లక్ష్యం



వేదికపై ఎస్‌డీపీఓ కాశ్యప్ తదితరులు

జయపురం: సమాజంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే పోలీసు సమితి సమావేశాల ప్రధాన లక్ష్యమని జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి పార్థ జగదీష్ కాశ్యప్ అన్నారు. బుధవారం జయపురంలోని సభాగృహంలో పోలీసు యంత్రాంగం అమొ పోలీసు సమితి(మన పోలీసు సమితి) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, పోలీసుల మధ్య సత్సంబంధాలు, అవగాహన కల్పించటం వల్ల సహృద్భావ సంబంధాలు నెలకొంటాయని చెప్పారు. కమ్యూనిటీ పోలీసింగ్ బలోపేతం చేయడం కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. ఎటువంటి సమాచారం అందించాలన్నా, ఫిర్యాదు చేయదలచుకున్నా పట్టణ పోలీసు స్టేషన్ 94389 16930, సదర్ పోలీసు స్టేషన్ 94389 16928 నంబర్లను సంప్రదించవచ్చన్నారు. సమావేశంలో జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, జయపురం సదర్ పోలీసు అధికారి సచీంద్ర ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు, స్థానికులు

సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ



సెల్‌ఫోన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పలాస: కాశీబుగ్గ కేటీ రోడ్డు బాలాజీ సెల్‌ఫోన్ దుకాణంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుకాణంలో ఉన్న రూ.1.20 లక్షల నగదును అపహరించారు. కాశీబుగ్గ పోలీసులు, బాధితుల కథనం మేరకు.. పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన నిమ్మన షణ్ముఖరావు కాశీబుగ్గ రోడ్డులో బాలాజీ సెల్‌ఫోన్ సర్వీసింగ్ సెంటర్ గత 15 ఏళ్లుగా నడిపిస్తున్నాడు. గత రెండు నెలలుగా సెల్‌ఫోన్ సర్వీసింగ్ దుకాణం ముందు తాత్కాలిక టిఫిన్ దుకాణం కూడా పెట్టారు. ఇదిలా ఉండగా బుధవారం ఉదయం 6 గంటల సమయంలో టిఫిన్ దుకాణం తెరిచేందుకు షణ్ముఖరావుతో పాటు వాళ్ల అన్నయ్య యువరాజ్ రాగా సెల్‌ఫోన్ దుకాణానికి వేసిన తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించారు. దీంతో లోపలికి వెళ్లి చూడగా సర్వీసింగ్ దుకాణంలో ఉన్న రూ.1.20 లక్షలు చోరీ జరిగినట్లు గుర్తించి కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ, శ్రీకాకుళం క్లూస్ టీం వెళ్లి వేలిముద్రలను సేకరించారు. అలాగే పలాసలో నివాసం ఉంటున్న జినగ గోపాల్‌కు సంబంధించిన టైలరింగ్ దుకాణంలో కూడా చోరీ జరిగింది. మూడు జతల దుస్తల దొంగతనం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. అక్కడ కూడా క్లూస్ టీం వేలుముద్రలను సేకరించారు. వీటిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ చెప్పారు.

భారీగా గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ

ఆమదాలవలస: పట్టణ పరిసర ప్రాంతాల్లో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్లు సీఐ పి.సత్యనారాయణ తెలియజేశారు. ఈ మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఆమదాలవలస ఎస్‌ఐ ఎస్.బాలరాజుకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు పురపాలక సంఘం పరిధిలోని 18వ వార్డు కంద్రపేట వద్దనున్న శ్మశానవాటిక వద్ద దాడులు చేపట్టామన్నారు. ఈ దాడుల్లో గంజాయితో ఇద్దరు యువకులు, ఒక మైనర్ బాలుడు పట్టుబడ్డారని పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి 21.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. పట్టుబడినవారిలో పట్టణంలోని కొత్త కంద్రపేటకు చెందిన కారుణ్య జగదీష్, ఐదో వార్డు సొట్టవానిపేట టీజీఆర్ నగర్ కాలనీకి చెందిన సయ్యద్ తహీర్ బాబుతో పాటు ఒక మైనర్ బాలుడు ఉన్నారన్నారు.

ఒడిశాలో కొనుగోలు చేసి...

వీరంతా ఒడిశా రాష్ట్రంలో బరంపురం సమీపంలోని కళ్లికోట్‌కు చెందిన నీలాంచల్ పట్నాయక్ వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు తెలుపడంతో వీరితో పాటు ఆయనను కూడా అరెస్టు చేశారు. వీరు కొనుగోలు చేసిన గంజాయిని రైలు మార్గం ద్వారా ఆమదాలవలసకు తరలిస్తూ, కొంతమొత్తం వీరు సేవిస్తూ మరికొంత విక్రయిస్తూ ఉండేవారని పేర్కొన్నారు. నిందితుడు కారుణ్య జగదీష్‌పై ఇప్పటికే 9 కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. 2024లో గంజాయి కేసు నమోదు అయ్యిందని ఇతనిపై స్టేషన్‌లో హిస్టరీ సీట్ కూడా ఉన్నట్లు తెలిపారు. అలాగే సయ్యద్ తాహిర్‌పై రెండు దొంగతనాలు కేసులు నమోదై ఉన్నాయన్నారు. మైనర్ వ్యక్తిపై మూడు సార్లు దొంగతనం కేసులు నమోదు అయ్యాయని, ఇతను ఇదివరకే అబ్జర్వేషన్ హోమ్‌కు వెళ్లి బయటకు వచ్చినట్లు చెప్పారు. పట్టుబడిన ముగ్గురు వ్యక్తులపై మాదకద్రవ్యాల నియంత్రణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులు నలుగురిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించనున్నట్లు వెల్లడించారు.

'ఫ్రాంక్లిన్ టెక్'తో మహిళా కళాశాల ఎంఓయూ



ఎంఓయూ పత్రాలతో సీఈఓ, ప్రిన్సిపాల్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ (అటానమస్) కళాశాల 'ఫ్రాంక్లిన్ టెక్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్'తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులతో నిర్వహించిన కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సులో ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆర్.శివకుమార్ మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్స్, సాఫ్ట్‌వేర్ ప్రాజెక్ట్స్, కార్పొరేట్ ట్రైనింగ్స్, కన్సల్టింగ్ సర్వీసెస్, ఇండస్ట్రీ కొలాబరేషన్, జాబ్ ప్లేస్‌మెంట్స్ తదితర అంశాలపై సుదీర్ఘంగా వివరించారు. కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ పరిజ్ఞానం, ఇంగ్లీష్‌పై పట్టు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా పేదలకు, అనాథలకు సేవ చేయాలని ఉందని చెబుతూ.. బీఏ హిస్టరీ విద్యార్థిని నందినికి నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చిన్నారావు, అకడమిక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.మౌనిక, తెలుగు విభాగాధిపతి డాక్టర్ కె.జ్యోతిలక్ష్మి, జేకేసీ కో–ఆర్డినేటర్ ఐ.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

నరసన్నపేట: జాతీయ రహదారిపై మండలంలోని తామరాపల్లి సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం పట్టణంలోని ఆదివారంపేటకు చెందిన దమ్ము నూకాలమ్మ (62) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మృతురాలు నూకాలమ్మ తన కుమారుడు సుధాకర్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై కోటబొమ్మాళి మండలం కొత్తపల్లిలో ఒక శుభ కార్యక్రమానికి వెళ్లింది. తిరిగి స్వగ్రామం ఆదివారంపేటకు వెళ్తుండగా తామరాపల్లి వద్ద ప్రమాదానికి గురయ్యారు. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని పశ్చిమ బెంగాల్ నుంచి వస్తున్న స్పోర్ట్ బైక్ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక ఉన్న నూకాలమ్మ తీవ్రగాయాలకు గురవ్వడంతో 108లో ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 9 గంటల సమయంలో ఆమె మృతి చెందారని ఏఎస్‌ఐ అశిరినాయుడు తెలిపారు. ఈ ప్రమాదంలో సుధాకర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రమాదంపై నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూలపేట పోర్టు పునరావాస కమిటీ సమీక్ష

శ్రీకాకుళం పాతబస్టాండ్: మూలపేట పోర్టు నిర్మాణానికి సంబంధించి పునరావాస అంశాలపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సమీక్ష బుధవారం జరిగింది. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో టెక్కలి ఆర్డీఓ, ఇతర శాఖల అధికారులు పాల్గొని పునరావాస గ్రామాల నిర్మాణం, స్థలాల కేటాయింపు, మౌలిక వసతులు, గృహ నిర్మాణాలు, తాగునీటి సరఫరా తదితర అంశాలపై చర్చించారు. తాగునీటి సరఫరా, రహదారి అనుసంధానం, పునరావాస ప్రక్రియ, విశేష గ్రామాల పరిధిలోని ఖాళీ స్థలాల వినియోగం, పోర్టు రహదారికి సంబంధించిన న్యాయపరమైన అంశాలు, రైల్వే మార్గంలో చేయాల్సిన సాంకేతిక మార్పులపై సమీక్షించారు. ఇతర శాఖల సమన్వయంతో జరుగుతున్న పనుల వివరాలను అధికారులు కమిటీకి సమర్పించారు. సమావేశంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి కిరణ్‌కుమార్, పంచాయతీరాజ్, నీటి పారుదల, రోడ్లు–భవనాల శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో... సాంకేతిక పథం..!

- ఈనెల 8వ తేదీ నుంచి కొత్తయాప్
- ఇకపై ముఖ ఆధారిత హాజరు
- రోజుకు రెండు పర్యాయాలు ఫొటోలు తీయాల్సిందే



హిరమండలంలో ఉపాధి పనులు చేపడుతున్న వేతనదారులు(ఫైల్)

హిరమండలం: ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో ఈనెల 8వ తేదీ నుంచి హాజరు నమోదుకు సరికొత్త ఆలోచనను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోంది. దీనిలో భాగంగా ఒక కొత్త యాప్‌ను తీసుకొచ్చారు. ఈ యాప్‌లో జాబ్ కార్డు ఉన్నటువంటి ప్రతి ఒక్కరి ఫొటోలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీంతో సదరు ఉపాధి వేతనదారు పనికి వచ్చిన అనంతరం అతని ఫొటో(ఐరిష్) తీస్తారు. ఒకవేళ యాప్‌లో నమోదు చేసిన వ్యక్తి ఫొటోకు మ్యాచ్ అవ్వకుంటే నగదు చెల్లింపులు చేసేందుకు వీలుండదు. ఈ యాప్‌ను శుక్రవారం నుంచి క్షేత్రస్థాయిలో ప్రవేశ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. దీంతో మండల స్థాయిలో ఉండే ఉపాధి అధికారులు తమ పరిధిలోని ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లుకు శిక్షణ ఇస్తున్నారు. అలాగే ఉపాధి ఏపీవోలు పని జరిగే ప్రాంతాల్లో కూలీలకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తెలియజేసేలా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

అత్యాధునిక సాంకేతికతతో....

కొత్త మస్టర్ విధానంలో అత్యాధునిక సాంకేతికతను తీసుకొచ్చి గ్రామ, మండల, జిల్లాలోని భౌగోళిక పరిస్థితిని అంచనా వేసేలా యాప్ రూపొందించారు. దీనిలో ఇప్పటికే నమోదైన కూలీల వివరాలు, జాబ్‌కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, కూలీల తాజా ఫొటోతో ఈకేవైసీ చేయించాలి. రెండు పర్యాయాలు ఫొటో తీసే సమయంలో వీటిలో ఏ ఒక్కటి సరిపోకపోయినా నమోదు కాదు. యాప్‌లో ఉపాధి హామీ ద్వారా గ్రామాల్లో గతంలో జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న పనుల వివరాలను ఎప్పటికప్పుడు ఉపాధి ఏపీవోలు రోజుకు రెండు గ్రామాలకు సంబంధించిన పనుల ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీంతో అటు ఉపాధి సిబ్బందికి, ఇటు కూటమి నాయకుల జేబులు నింపుకునే విధానానికి పెద్ద గండి పడినట్లు అవుతుంది.

హాజరు ఇలా..

ముఖ ఆధారిత హాజరు తీసుకునే విధానంలో కొత్త పద్ధతులను అవలంభించేలా మార్గదర్శకాలను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఎన్నికల అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి, తమవారిని నియమించుకున్న కూటమి నాయకులకు ఈ కొత్త పద్ధతి అమల్లోకి వచ్చిన తర్వాత గొంతులో వెలక్కాయ పడిన పరిస్థితి ఏర్పడుతుంది. ముఖ ఆధారిత హాజరు విధానంలో భాగంగా కూలీల ఫొటోలను సెల్‌ఫోన్‌లో తీసుకుని జాతీయ మొబైల్ పర్యవేక్షణ వ్యవస్థకు (ఎన్‌ఎంఎంఎస్)కు అనుసంధానం చేయాల్సి ఉంటుంది. పని ప్రదేశంలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేసే కూలీల ఫొటోలను తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ సమయంలో ఒకరు తరుపున మరొకరు హాజరైనట్లు చూపితే ఆన్‌లైన్‌లో హాజరు తీసుకోదు.




కొత్త యాప్‌పై శిక్షణ ఇస్తున్న అధికారులు

4 గంటల తర్వాతే ఫొటో అప్‌లోడ్

పని ప్రదేశంలో మొదటి ఫొటోను ఉదయం 6 గంటలకు తీసి అప్‌లోడ్ చేస్తే, అనంతరం 4 గంటల తర్వాత అనగా ఉదయం 10 గంటలకు ఫోన్‌లో మరోసారి ఫొటో అప్‌లోడ్ చేయాలని సిగ్నల్ వస్తుంది. ఆ తర్వాత ఫొటో అప్‌లోడ్ చేయకపోతే ఆరోజు కూలీలకు నగదు చెల్లింపులు ఉండవు. ఇలా చేయడం వలన ఇదివరకు మస్టర్ల మాయాజాలం చేసేవారికి ఇబ్బందులు తప్పవు. కాగా అదే సమయంలో ఉపాధి వేతనదారులకు ప్రస్తుతం ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. మూడు నెలలుగా వేతనదారులకు నగదు చెల్లింపులు చేయలేదు. కేంద్ర ప్రభుత్వం నగదును విడుదల చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని పక్కదారి పట్టించింది. అయితే రెండు రోజుల్లో కొత్త విధానం ప్రారంభమవ్వనున్న నేపథ్యంలో తమకు రావాల్సిన మూడు నెలలు వేతనాల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు.

అవకతవకలకు చెక్



ఉపాధి పనుల్లో కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన యాప్‌ను ఈనెల 8వ తేదీ నుంచి అమలు చేయనున్నాం. దీంతో ఉపాధి పని జరిగేచోట ఎలాంటి అవకతవకలకు అవకాశం ఉండదు. అలాగే వేతనదారులు కూడా ఒకరి బదులుగా మరొకరు పనిచేస్తున్నారనే విమర్శలకు చెక్ పడుతుంది. పని జరిగేచోట నాలుగు దిక్కుల్లో ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. వేతనదారులకు నగదు చెల్లింపులు త్వరగా చేపడతాం.

– ఎ.శ్రీనివాసరావు, ఏపీవో, హిరమండలం

విషాద తీరం!

- భావనపాడు తీరానికి చేరిన మూడు మృతదేహాలు
- శోకసంద్రంలో బాధిత కుటుంబాలు



సంతబొమ్మాళి: భావనపాడు సముద్రతీరంలో మంగళవారం సాయంత్రం గల్లంతైన ముగ్గురు పాలిటెక్నికల్ విద్యార్థులు దున్న దుర్యోధన, తిమ్మల జశ్వంత్, రాయట రాజేష్ విగతజీవులుగా మారారు. వీరి మృతదేహాలు బుధవారం తీరానికి చేరాయి. మెరైన్ సీఐ రాము ఆధ్వర్యంలో మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకారులు రెండు బృందాలుగా విడిపోయి రాత్రంతా సముద్రంలో గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం అర్ధరాత్రి సుమారు 12 గంటలకు జశ్వంత్ మృతదేహం భావనపాడు తీరానికి చేరింది. ఆ తర్వాత గంటన్నర వ్యవధిలో రాత్రి 1.30 గంటలకు రాజేష్ మృతదేహం అదే తీరానికి చేరుకుంది. మిగిలిన దుర్యోధన మృతదేహం బుధవారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు భావనపాడు తీరానికి కొట్టుకొచ్చింది. మృతదేహాలకు శవపంచమా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుమారుల మృతదేహాలను చూసి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు.



రాజేష్, దుర్యోధన, జశ్వంత్ మృతదేహాలు

క్లుప్తంగా

హెచ్‌సీ కుటుంబానికి ఆర్థిక సహాయం



హెచ్‌సీ కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయం అందిస్తున్న వాట్సాప్ గ్రూప్ సభ్యులు తదితరులు

డెంకాడ: రోడ్డు ప్రమాదంలో మరణించిన చింతలవలస ఐదవ ఏపీఎస్‌పీ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ కోరాడ రామునాయుడు కుటుంబానికి పోలీస్ వాట్సాప్‌గ్రూప్ సభ్యులు రూ.లక్షా 50వేల 662ల ఆర్థిక సహాయం చేశారు. ఏపీ పోలీస్ వాట్సాప్ గ్రూపులోని సభ్యులు వితరణగా ఇచ్చిన మొత్తాన్ని మృతుడు హెచ్‌సీ రామునాయుడు కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రూపు సభ్యులు లెంక రాము, మిత్తిరెడ్డి అప్పలనాయుడు, శీర గణేష్, అక్కుపల్లి గోవింద, మజ్జి కూర్మారావు, గొర్లె శ్రావణ్‌కుమార్, మీసాల చంద్రమౌళి, కల్యాణపు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

16న రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం గ్రామంలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా 16వ తేదీన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు ఉత్తరాంధ్ర క్విజ్ మాస్టర్ కర్రి రాము బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు 16వ తేదీన ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు.అన్ని రకాల పోటీ పరీక్షలు రాసేందుకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు అర్హులని తెలిపారు . ఆరుగురు అభ్యర్థులు ఒక గ్రూప్‌గా ఏర్పండి పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. హైటెక్ విజయరహస్యం-2025 మ్యాగజైన్, ఇంగ్లీష్, కరెంట్ అఫైర్స్ తదితర అంశాలపై పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో గెలుపొందిన గ్రూప్‌లకు వరుసగా రూ.5వేలు, రూ.4వేలు, రూ 3వేలు, రూ.2వేలు నగదు బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.ఈ పోటీలు గ్రామ మాజీ సర్పంచ్ తిక్కాన చిన్నదేముడు ఆర్థిక సహాయంతో నిర్వహించనున్నట్లు చెప్పారు.

9న జిల్లా స్థాయి యోగా పోటీలు

విజయనగరం: జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9న జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అవనాపు విక్రమ్ బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల తోటపాలెం గాయత్రి టెక్నో స్కూల్‌లో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్స్ విభాగాల్లో 8 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల వారికి ఎంపికలు జరుగుతాయని తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు తమ పేర్లను 8వ తేదీ సాయంత్రం లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెంలో నిర్వహించే రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారు, మైసూర్ (కర్ణాటక)లో నిర్వహించే జాతీయస్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని వివరించారు. జిల్లా స్థాయి యోగా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు పేర్ల నమోదు, మరిన్ని వివరాలకు ఫోన్ 8374904262,7993696087 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అయిన వారు వదులుకున్నారు, 108 సిబ్బంది ఆదుకున్నారు



108 వాహనంలో బాధితుడు వెంకటరావుకు చికిత్స నిర్వహిస్తున్న టెక్నీషయన్ సన్యాసినాయుడు

కొత్తవలస: కష్టపడి పని చేసి కుటుంబాన్ని పోషించిన వ్యక్తి అవసరం తీరిపోవడంతో అయిన వారు వదులుకున్నారు. అయితే ఆ వ్యక్తిని 108 సిబ్బంది ఆదుకున్నారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కొత్తవలస మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఒక వ్యక్తి సొమ్మసిల్లి పడిపోయాడని స్థానికులు 108 వాహనం సిబ్బందికి సమాచారం అందించారు.దీంతో 108 వాహసం సిబ్బంది టెక్నీషయన్ సీహెచ్.సన్యాసినాయుడు, పైలెట్ విజయ్‌కుమార్‌లు 108 వాహనంలో వచ్చి పరిశీలించగా ఆ వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంటనే ప్రథమ చికిత్స నిర్వహించి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు.అక్కడికి వెళ్లేసరికి సంబంధిత వ్యక్తికి మెలకువ రావడంతో వివరాలు అడగ్గా తాను ఉప్పల వెంకటరావును. కారు డ్రైవర్‌నని తెలిపాడు. భార్య,ఇద్దరు ఆడపిల్ల లు ఉన్నారని, పిల్లలకు పెళ్లిళ్లు జరిపించినట్లు తెలిపాడు. తాను ఆనారోగ్యం పాలుకావడంతో కుటుంబసభ్యులు చిన్నచూపు చూడడంతో అక్కడక్కడ తింటూ రోడ్డుపైనే కాలక్షాపం చేస్తున్నట్లు తెలిపాడు. ప్రస్తుతం ఆ వ్యక్తి పరిస్థితి నిలకడగా ఉందని ఆయన బంధువులకు సమాచారం అందించామని 108 సిబ్బంది తెలిపారు.

గిరిజన రైతుల హక్కులు కాలరాస్తే సహించం

- సాగుచేసిన భూములు వారి స్వాధీనంలోనే ఉండాలి
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర,
- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు
- కాకర్లవలస, కారేడువలసలో భూముల పరిశీలన



గిరిజన రైతులతో కలిసి ధర్నా చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



తమ గోడు వినిపించుకునేందుకు పెద్ద ఎత్తున హాజరైన గిరిజన రైతులు

రామభద్రపురం: ఎన్నోఏళ్లుగా సాగులో ఉన్న భూములపై సర్వ హక్కులు గిరిజన రైతులవేనని వారి హక్కులను కాలరాస్తే సహించేది లేదని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు హెచ్చరించారు. ఈ మేరకు రామభద్రపురం మండలంలోని కాకర్లవలస, కారేడువలస గిరిజన రైతులు చాలా రోజులుగా భూసమస్యలపై పోరాడుతున్న సమాచారం తెలుసుకున్న వారు బుధవారం ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయా భూములను పరిశీలించారు.ఈ భూముల్లో ఎప్పటి నుంచి సాగులో ఉన్నారు? మీ దగ్గర నుంచి తీసుకునేటప్పుడు మీకు నోటీసులు ఇచ్చారా లేదా? అని ఆరా తీస్తూ గిరిజన రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏపీఐఐసీ అధికారులు, ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు కోసం పేదల పొట్టగొడుతూ మేము ఎన్నో ఏళ్లుగా కష్టపడి సాగుచేసుకుంటున్న పంటలు సైతం దౌర్జన్యంగా నాశనం చేయడంతో పాటు లాక్కుంటున్నారని గిరిజన రైతులు వారి దృష్టికి తీసుకెళ్లారు.అలాగే దశాబ్దాల కాలంగా మేము సాగులో ఉన్న ఇవే భూములకు పట్టాలు ఇవ్వాలని పోరాటాలు చేస్తే రెవెన్యూ అధికారులు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు ఇచ్చారని వారి వద్ద గిరిజన రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ అధికారం ఉపయోగించి పోలీసుల సహకారంతో దౌర్జన్యంగా చేసి గిరిజనులను భయపెట్టడం సమంజసం కాదన్నారు. ఆరుగాలం కష్టపడి పెంచుకుంటున్న మామిడి తోటలు, జీడి తోటలు, మొక్కజొన్న, పత్తి పంటలు ధ్వంసం చేయడానికి ఏపీఐఐసీ అధికారులకు మనసు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. తాము అభివృద్ధికి అడ్డుకాదని, ప్రభుత్వ ప్రయోజనాలు, ప్రజాప్రయోజనాల కోసమో సాగుభూముల్లో పనులు చేస్తే పద్ధతిని పాటిస్తూ ముందుకెళ్లాలన్నారు.

పాలన ఇలాగేనా?

ఇక్కడ పంచాయతీ సర్పంచ్‌కు గాని, గిరిజన రైతులకు కానీ కనీస సమాచారం ఇవ్వకుండా ఎలా లాక్కుంటారని ప్రశ్నించారు. గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని,గిరిజన ప్రజలకు మంచి చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు ఇలాగేనా పాలించేది అని ప్రశ్నించారు. 2009లో వనసంరక్షణ కింద అప్పటి కలెక్టర్ వీర బ్రహ్మయ్య గిరిజనులకు పట్టాలు ఇచ్చారని,అప్పటికే ఎన్నో ఏళ్ల నుంచి బీడు భూములను బాగు చేసుకుని గిరిజన రైతులు సాగులో ఉంటే ఇప్పుడు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. గిరిజన రైతులేమీ దొంగతనంగా ఆక్రమించుకోలేదన్నారు. దౌర్జన్యంగా ధ్వంసం చేసిన పంటలకు నష్టపరిహారం ఇవ్వడంతో పాటు గిరిజన రైతులకు కొండ ప్రాంతంలో కాకుండా ఈ భూములకే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన రైతులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, గ్రామ సర్పంచ్ మజ్జి రాంబాబు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు, మండల యూత్ అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిర్ల చంద్రశేఖర్ సీఐటీయూ నాయకుడు బలస శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

పల్లెనిద్రతో ప్రజలకు భరోసా

- ఎస్పీ వకుల్ జిందల్



పల్లెనిద్ర వివరాలు చెబుతున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలను భాగస్వాములను చేయడమే లక్ష్యంగా 'పల్లె నిద్ర' కార్యక్రమం చేపట్టామని ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం తెలిపారు. ప్రతి నెలలో రెండు గ్రామాల్లో 'పల్లె నిద్ర' చేయాలని ఎస్సైలు, సీఐలను ఆదేశించామని ఎస్పీ అన్నారు. ప్రజలతో మమేకమై, వారి సమస్యలను తెలుసుకుంటూ, వివిధ నేరాలు, చట్టాల మీద అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోగల గ్రామం లేదా వార్డులో ఎస్సై లేదా సీఐ స్థాయి అధికారులు, దత్తత గ్రామాల కానిస్టేబుల్స్ 'పల్లె నిద్ర' చేపట్టే విధంగా అధికారులను ఇప్పటికే ఆదేశించామని ఎస్పీ వకుల్ జిందల్ స్పష్టం చేశారు. 'పల్లె నిద్ర' కార్యక్రమంతో ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచుతున్నామన్నారు. నేరాల నియంత్రణ, ప్రజల సహకారంతో పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయడమే 'పల్లె నిద్ర' ప్రధాన లక్ష్యమన్నారు. జిల్లాలో 'పల్లె నిద్ర' కార్యక్రమాన్ని ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 300 గ్రామాల్లో పోలీసు అధికారులు కార్యక్రమం చేపట్టారని తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం



అదృశ్యమైన పతివాడ కాశయ్య

విజయనగరం క్రైమ్ : నగరంలోని ఇందిరానగర్ లో నివాసముంటున్న పతివాడ కాశయ్య (69) అదృశ్యమైనట్లు బుధవారం విజయనగరం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కాశయ్య కొడుకు తిలక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టేషన్ హెచ్‌సీ అప్పలనాయుడు కేసు నమోదు చేయగా సీఐ ఆర్‌వీకే చౌదరి దర్యాప్తు ప్రారంభించారు.గత నెల 23న ఇంటి నుంచి వెళ్లిపోయిన కాశయ్య ఇప్పటివరకు ఇంటికి తిరిగాలేదని కొడుకు తిలక్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాగా కాస్త మతిస్థిమితం లేదని ఇంట్లో గొడవపడి గత నెలలోనే ఇంటి నుంచి వెళ్లిపోయాడన్నారు. క్రైమ్ పార్టీ కాశయ్య కోసం వెతుకులాట చేపట్టారని సీఐ చౌదరి ఈ సందర్భంగా చెప్పారు

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



రైల్వే ప్లాట్ ఫాంపై గుర్తుతెలియని మృతదేహం

విజయనగరం క్రైమ్: విజయనగరం రైల్వేస్టేషన్ ప్లాట్ ఫాం నంబర్ 5పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని బుధవారం జీఆర్పీ సిబ్బంది గమనించారు. మృతుడి వయస్సు 50 నుంచి 55 ఉంటుందని సుమారు ఆరడుగుల ఎత్తు, సిమెంట్ రంగు షర్ట్ , నీలిరంగు ప్యాంట్ ధరించిన వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నామని జీఆర్పీ హెచ్‌సీ అశోక్ తెలిపారు. మృతుడి కుడి చేతికి ఎర్రటి తాడు ఉందని సదరు వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే ఫోన్ 9490617089, 6301365605 నంబర్లకు కానీ ల్యాండ్ లైన్ 08912883218 నంబర్‌కు కానీ ఫోన్ చేయాలని హెచ్‌సీ అశోక్ తెలిపారు.

జాతీయలోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత

విజయనగరం లీగల్: జాతీయ లోక్ అదాలత్‌ను చిట్స్ అండ్ ఫైనాన్స్ కంపెనీలు, జాతీయ, ప్రైవేట్ బ్యాంకులు సద్విని యోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కోర్టు సముదాయంలో ప్రముఖ చిట్‌ఫండ్ కంపెనీల బ్యాంక్ మేనేజర్లు, బ్యాంకులకు సంబంధించిన అధికారులు, కంపెనీ న్యాయవాదులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిట్ కంపెనీలకు, బ్యాంక్‌కు సంబంధించిన కేసులను సెప్టెంబర్ 13న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో పరిష్కరించుకోవచ్చన్నారు. పెండింగ్‌లో ఉన్న బ్యాంకు దావాలను ఎక్కువ కేసులను రాజీ చేయాలని కంపెనీలకు సంబంధించిన బ్రాంచ్ మేనేజర్, బ్యాంక్ మేనేజర్లకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్, మార్గదర్శి చిట్‌ఫండ్స్, కపిల్ చిట్‌ఫండ్స్ శ్రీరామ్ చిట్‌ఫండ్స్, శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

ఉపాధికోసం వెళ్లి తిరిగిరాని లోకాలకు..!

- మేడపై నుంచి జారిపడి యువకుడి మృతి
- హైదరాబాద్‌లో ప్రమాదం



సందీప్ (ఫైల్)



తలకు బలమైన గాయంతో సందీప్

పాలకొండ రూరల్: నగర పంచాయతీ పరిధి జంగాలవీధిలో నివాసముంటున్న దేవళ్ల శంకరరావు, ఉషారాణి దంపతుల ఒక్కగానొక్క కుమారుడు సందీప్(24) హైదరాబాద్‌లో జరిగిన ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. సందీప్ డిగ్రీ వరకూ చదువుకున్నాడు. ఉపాధి మార్గంలో భాగంగా తనకు ఇష్టమైన హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తి చేశాడు. ఈ క్రమంలో ఆరు నెలల క్రితం ఉద్యోగ అన్వేషణలో హైదరాబాద్ చేరాడు. అక్కడి జూబ్లీహిల్స్‌లో గల ఓ కేఫ్‌లో కొలువు పొందాడు. కొడుకు అందుకొస్తున్నాడని తల్లిదండ్రులు భావిస్తున్న తరుణంలో విధి కన్నుకుట్టింది. కేఫ్ యాజమాన్యం సమకూర్చిన మూడంతస్తుల భవనంలో వసతి పొందుతున్న సందీప్ బుధవారం ఉదయం 5 గంటల సమయంలో భవనం పైనుంచి జారి పడిపోయాడు. ఈ విషయాన్ని సందీప్ సహచరులు పాలకొండలో ఉన్న తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. విషయం తెలుసుకుని ఉలిక్కిపడిన వారు హుటాహుటిన హైదరాబాద్ పయనమయ్యారు. సందీప్ తలకు గాయం కావడంతో గాంధీ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలిస్తున్నట్లు సహచరులు తెలియజేయడంతో కంగారు పడ్డారు. ఇంతలో సందీప్ తుదిశ్వాస విడిచాడన్న వార్త తెలియగానే షాక్‌కు గురైనట్లు తండ్రి శంకరరావు తెలిపాడు. తాను టైలరింగ్ చేస్తూ, తన భార్య మెప్మాలో అత్యంత చిన్న ఉద్యోగం చేస్తూ రెక్కల కష్టంపై పిల్లలను అల్లారుముద్దుగా పెంచామని, వారి భవిష్యత్తు కోసం కన్న కలలు తీరకుండానే తిరిగిరాని లోకానికి చెయ్యెత్తు కొడుకు వెళ్లిపోయాంటూ తల్లిదండ్రులు రోదించారు. ఈ విషయం తెలియడంతో స్థానిక జంగాల వీధితోపాటు మృతుని బంధువులు, స్నేహితుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

దేశ రాజధాని పెద్దల దృష్టికి జిందాల్ సమస్య



జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ చైర్మన్ కిశోర్ మఖానాను కలిసి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: భూములు కోల్పోయి ఉపాధి కరువై రోడ్డున పడిన జిందాల్ పరిశ్రమ నిర్వాసితుల గోడును దేశరాజధానికి తీసుకెళ్లామని ఎమ్మెల్సీ రఘురాజు చెప్పారు. ఈ మేరకు బుధవారం బొడ్డవరలో ఆయన తన స్వగృహంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 45రోజులు రైతులు రోడ్డున పడి ఆందోళన చేస్తుంటే స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, రాష్ట్ర సర్కారులో కనీస స్పందన కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యకు పరిష్కారం చూపాలని, ఢిల్లీలో జాతీయ మానవహక్కుల సంఘం, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల కమిషన్ల చైర్మన్లను కలిసి జిందాల్ రైతాంగ సమస్యలు వివరించామన్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఇప్పటికే 15 రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు చెప్పారు. కలెక్టర్‌ను కలిసి ఆర్‌అండ్‌ఆర్ అమలులో జరిగిన లోపాలు, చెల్లింపుల్లో తప్పిదాలను వివరించామన్నారు. జిందాల్ నిర్వాసితులకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.

నిందితుడి కోసం తీవ్ర గాలింపు

- సవాల్‌గా తీసుకున్న పోలీసులు



నిందితుడు సిమ్మ అప్పారావు

కొత్తవలస: మండలంలోని ముసిరాం గ్రామంలో నాటు తుపాకీతో తన సమీప బంధువును మంగళవారం సాయంత్రం కాల్చి పరారైన నిందితుడు సిమ్మ అప్పారావు (35) ఆచూకీ కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. ఈ మేరకు ప్రత్యేక పోలీస్ బృందాలు రంగంలోకి దిగినట్లు సీఐ షణ్ముఖరావు తెలిపారు. ముసిరాం గ్రామానికి చెందిన సిమ్మ అప్పారావును అనకాపల్లి జిల్లా కోటపాడు మండలం పాతవలసకు చెందిన సిమ్మ అప్పారావు మంగళవారం తుపాకీతో కాల్చి చంపిన విషయం పాఠకులకు విదితమే. నిందితుడు అప్పారావు తుపాకీతో కాల్చి తోటల్లోంచి పరెగెత్తుకుంటూ పోయాడని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటనా స్థలం నుంచి పరుగెత్తుకుంటూ అనకాపల్లి జిల్లా కోటపాడు మండలం గొట్లాం గ్రామం రోడ్డువరకు ద్విచక్రవాహనంపై వెళ్లి అక్కడ బండి దిగి ముసిరాం గ్రామానికి చెందిన సిమ్మ అప్పారావును తుపాకీతో కాల్చి చంపేశానని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడని నిందితుడి చినాన్న తెలిపాడు. కాగా తోటల్లోంచి వచ్చిన సమయంలో నిందితుడి వద్ద తుపాకీ లేదని తెలిపాడు. తుపాకీని తోటలోనే ఎక్కడో పడేశాడని పోలీసులు అంచనాకు వచ్చి వెతికేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలను రంగంలోకి దించారు. ఉదయం నుంచి గ్రామం సమీపంలో గల జీడి, మామిడితోటల్లో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. పలు గ్రామాల్లో గల నిందితుడి బంధువుల ఇళ్లల్లోను తనిఖీ చేశారు. అయినా ఆచూకీ లభించలేదు. కాగా నిందితుడికి హెవీ వెహికల్ డ్రైవర్‌గా పని చేసిన అనుభవం ఉండడంతో గొట్లాం జంక్షన్ నుంచి ఇతర ప్రాంతానికి వెళ్లి పోయి ఉంటాడని స్థానికులు చెబుతున్నారు. పోలీసులకు మాత్రం ఈ కేసు సవాల్‌గా మారింది. కాగా మృతుడు సిమ్మ అప్పారావు కుమారుడు అంజి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామని సీఐ షన్ముఖరావు తెలిపారు.

పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జ్‌లు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- జిల్లాలో మొత్తం పీఏసీఎస్‌లు 42
- 18 సొసైటీలకు గతంలో త్రీమెన్ కమిటీ నియామకం
- మిగిలిన 24 సొసైటీల్లో కొలిక్కిరాని కమిటీలు
- 24 సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జ్‌ల నియామకం



పర్సన్ ఇన్‌చార్జ్‌ను నియమించిన వీరఘట్టం పీఏసీఎస్



BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF ANDHRA PRADESH

ప్రత్యేకాధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు

వీరఘట్టం: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పీఏసీఎస్‌లలో నామినేటెడ్ పదవులు వస్తాయని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. పార్వతీపురం మన్యం జిల్లాలోని పలు చోట్ల సొసైటీల్లో త్రీమెన్ కమిటీ నియామకాలకు కూటమిలో ఏర్పడిన కుమ్ములాటలతో పీఏసీఎస్‌లో చైర్మన్ కుర్చీలు ఖాళీగా మిగిలాయి. ముఖ్యంగా జిల్లాలోని పాలకొండ, పార్వతీపురం డివిజన్లలో ఈ నియామకాలు ఆగిపోయాయి. మిగిలిన చోట్ల నెల రోజుల క్రితమే త్రీమెన్ కమిటీలను ఎమ్మెల్యేల సిఫార్సులతో నియమించారు. చైర్మన్ కుర్చీలు ఖాళీగా ఉన్న చోట ఆ ఖాళీలను భర్తీ చేసేందుకు ఈనెల 1న ప్రభుత్వం పర్సన్ ఇన్‌చార్జ్‌లను ఈ సొసైటీలకు నియమించింది. ఆరు నెలల పాటు 2026 జనవరి 30 వరకు పర్సన్ ఇన్‌చార్జ్‌లు ఇక్కడ ప్రత్యేకాధికారులుగా వ్యవహరించేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో చాలా రోజులుగా పీఏసీఎస్‌లలో చైర్మన్ పదవి వస్తుందని ఆశించిన వారికి నిరాశే మిగిలిందని పలువురు చర్చించుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 42 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా(పీఏసీఎస్)లు ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పీఏసీఎస్‌లలో నియమించిన త్రీమెన్ కమిటీలు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2024 జూన్ 28న స్వచ్ఛందంగా తప్పుకున్నారు.దీంతో గత 14 నెలలుగా పీఏసీఎస్‌లలో త్రీమెన్ కమిటీలు లేక పాలన గాడి తప్పుతోంది. ఈ క్రమంలో గతేడాది అన్ని సొసైటీలకు ఆరు నెలల పాటు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. తొలుత పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించాలని ఆలోచన చేసిన ప్రభుత్వం తర్వాత నామినేటెడ్ పద్ధతిలో త్రీమెన్ కమిటీలను నియమించాలని ఆలోచన చేసింది. దీంతో జిల్లాలోని ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫార్సులతో 18 పీఏసీఎస్‌లకు నెలరోజుల క్రితం త్రీమెన్ కమిటీలు నియమించారు. చైర్మన్ పదవి కోసం అటు టీడీపీ, ఇటు జనసేన నేతల మధ్య పోటీ ఏర్పడడంతో జిల్లాలో 24 పీఏసీఎస్‌లలో త్రీమెన్ కమిటీ నియామకాల కోసం ఎమ్మెల్యేలు, మంత్రులు కుస్తీ పడుతున్నారు. ఇంతలో ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న ప్రత్యేకాధికారులను మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇవ్వడంతో ఆశావహులు కంగుతిన్నారు.

24 పీఏసీఎస్‌లకు ప్రత్యేధికారులు..

పాలకొండ నియోజకవర్గంలో 8 పీఏసీఎస్‌లు ఉండగా ఇక్కడ ఏ ఒక్క సొసైటీలో కూడా త్రీమెన్ కమిటీలను నియమించలేకపోయారు. ముఖ్యంగా ఇక్కడ ఉన్న జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు, టీడీపీ ఇన్‌చార్జ్ భూదేవిల మధ్య సయోధ్య కుదరకపోవడంతో సొసైటీల్లో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయలేకపోయారని అందరూ చర్చించుకుంటున్నారు. దీంతో ఈ నియోజకవర్గంలోని భామిని, బత్తిలి, అర్ధలి, బాసూరు, పాలకొండ, ఆర్‌బీఆర్.పేట, తంపటాపల్లి, వీరఘట్టంలో త్రీమెన్ కమిటీలు వేయలేదు. అలాగే పార్వతీపురం డివిజన్‌లోని గరుగుబిల్లి, చినమేరంగి, కృష్ణపల్లి, పలగర, గలావిల్లి, అజ్జాడ, బూర్జ, సీతానగరం, కాశీపేట, గెద్దలుప్పి, పార్వతీపురం, తామరఖండి, అంటిపేట, ఆర్.వెంకమ్మపేట, మరిపివలస, పాపమ్మవలస సొసైటీలకు కూటమి నాయకులు త్రీమెన్ కమిటీలను వేయకపోవడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది.

ప్రత్యేకాధికారులను నియమించారు

జిల్లాలో త్రీమెన్ కమిటీలు లేని 24 సొసైటీలకు ప్రభుత్వం పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించింది.వచ్చే ఏడాది జనవరి 30 వరకు ఇన్‌చార్జ్‌లు ఉంటారు.ఒక వేళ ఇంతలో త్రీమెన్ కమిటీలు వస్తే పర్సన్ ఇన్‌చార్జ్‌లు మరి ఉండరు.

పి.శ్రీరామమూర్తి, జిల్లా కోపరేటివ్ అధికారి

'అంగన్‌వాడీ'లకు యాప్ కష్టాలు

- బాలింతలు, గర్భిణుల గుర్తింపునకు ఆపసోపాలు
- సరిగా పని చేయని బాలసంజీవిని, పోషణ ట్రేకర్ యాప్‌లు
- పని చేయని సెల్‌ఫోన్లు వద్దని అంగన్‌వాడీల ఆందోళన



సక్రమంగా పని చేయని సెల్‌ఫోన్‌లు వద్దని భోగాపురం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పూసపాటిరేగ:

అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వం తెచ్చిన యాప్‌లతో అష్టకష్టాలు పడుతున్నారు. ముఖచిత్ర గుర్తింపునకు పడరాని పాట్లు పడుతున్నారు. నాసిరకం 2 జీ సిమ్‌లు వున్న సెల్‌లు అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చి ట్రాక్ చేయమనడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికే సిగ్నల్ క్యాచ్ చేయని సెల్‌ఫోన్‌లు మాకొద్దు అని భోగాపురం సెక్టారు పరిధి మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చేశారు. పోషకాహారం పంపిణీ చేయాలంటే తప్పనిసరిగా ముఖచిత్ర గుర్తింపు వేయాలని కార్యకర్తలు వాపోతున్నారు. గంటల కొద్దీ ప్రయత్నం చేసినా ట్రాక్ కాకపోవడంతో అవస్థలు పడుతున్నామని లబ్ధిదారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు వాపోతున్నారు.
లబ్ధిదారులకు బాల సంజీవిని, పోషణ పదార్థాలు అందించాలంటే రెండు యాప్‌లు నిర్వహించాలి. లబ్ధిదారులకు ఫేస్ గుర్తింపు యాప్‌లో నమోదు చేయాలి. కానీ అక్కడ నుంచే ఇబ్బందులు ప్రారంభం అవుతున్నాయి. ప్రభుత్వం బాలసంజీవిని ద్వారా ముఖ గుర్తింపుతో వివిధ రకాల సరుకులు అందిస్తుంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పోషణ ట్రాకర్ ద్వారానే లబ్ధిదారులను గుర్తించి సరుకులు ఇవ్వాలనే నిబంధనలను తప్పనిసరి చేయడంతో కార్యకర్తలు రెండు యాప్‌లను వినియోగించాల్సి వస్తుంది. ఈ విధానంతో ఇబ్బందులు పడుతున్నామని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో టీహెచ్‌ఆర్ కింద నెలకు రెండు సార్లు ఇంటికే పోషకాహారం పంపిణీ చేసే వారని లబ్ధిదారులు చెబుతున్నారు. తాజా పరిస్థితిపై ప్రభుత్వానికి నిరసనలు తెలియజేసి చెప్పినప్పటికి ఎటువంటి ఫలితం లేదని కార్యకర్తలు అంటున్నారు. యాప్‌ల నిర్వహణతో పాటు రికార్డులు నిర్వహణ వలన చిన్నారులకు బోధించే ప్రాథమిక విద్యకు ఆటంకం కలుగుతోందని అంటున్నారు. ప్రీ స్కూల్ విద్యార్థుల నమోదు, సరుకులు నమోదు తప్పనిసరిగా చేయాలన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పనిచేయని సెల్‌ఫోన్‌లు ఇచ్చి ఆందోళన కలిగిస్తున్నారని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ కోల్పోతున్నాం..

యాప్ కష్టాలతో రేషను కోల్పోతున్నాం. యాప్ ట్రాక్ చేయడానికి ఎన్నిసార్లు ప్రయత్నించినా ఫలితం లేదు. సిగ్నల్ సమస్యతో పాటు నాసిరకం సెల్‌ఫోన్‌ల సరఫరా తదితర కారణాలతో ఇబ్బందులు పడుతున్నాం. తక్షణమే అధికారులు స్పందించి ఉపయోగకరమైన సెల్ ఫోన్‌లు లేదా ట్యాబ్‌లు సరఫరా చేయాలి.

– ఆదిలక్ష్మి, బాలింతరాలు, పూసపాటిరేగ

సిగ్నల్ లేక అవస్థలు

యాప్ ట్రాక్ చేయడానికి సిగ్నల్ లేకపోవడంతో లబ్ధిదారులకు పోషకాహారం సక్రమంగా సరఫరా జరగడం లేదు. ఫోన్‌లో సాంకేతిక సమస్య కారణంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. తక్షణమే అధికారులు సాంకేతికతతో కూడిన సెల్‌ఫోన్‌లు లేదా ట్యాబ్‌లు అందజేయాలి.

– అంగన్‌వాడీ కార్యకర్త, పూసపాటిరేగ మండలం